సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం : 21 : జనవరి : 2024



కమనీయం.. కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.



భారీ డాల్ఫిన్ కళేబరం

భీమునిపట్నం: భీమిలి తీరానికి శనివారం సాయంత్రం భారీ డాల్ఫిన్ కళేబరం కొట్టుకొచ్చింది.

బ్రహ్మపూర్-సికింద్రాబాద్ స్పెషల్ రీషెడ్యూల్



తాటిచెట్లపాలెం: బ్రహ్మపూర్‌లో శనివారం మధ్యాహ్నం 12.30గంటలకు బయల్దేరవలసిన బ్రహ్మపూర్-సికింద్రాబాద్ స్పెషల్ పెయిరింగ్ రైలు ఆలస్యంగా చేరుకున్నందున సుమారు 7గంటలు ఆలస్యంగా రాత్రి 7.30గంటలకు బయల్దేరింది.

న్యూస్‌రీల్

27న విశాఖకు సీఎం

- భీమిలిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు
- నేడు స్థలాలను పరిశీలించనున్న వైవీ సుబ్బారెడ్డి, తలశిల రాఘురాం



విశాఖ సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన విశాఖకు వస్తున్నట్లు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించేందుకు భీమిలిలో 27వ తేదీన భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేసి ఎన్నికల శంఖారావానికి ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు. ఈ సభకు అవసరమైన స్థలాల పరిశీలన కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆదివారం విశాఖకు వస్తున్నట్లు వెల్లడించారు. లక్షలాది మందితో చేపట్టే సభకు స్థలాలను పరిశీలించడంతో పాటు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షిస్తారని తెలిపారు.

24న వైఎస్సార్ వాహన మిత్ర రోడ్‌షో



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గంగవరం: ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఈనెల 24న మండలంలో వైఎస్సార్ వాహన యాత్ర(రోడ్ షో) నిర్వహించనున్నట్లు ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం నెల్లిపూడిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ షో ఉదయం 10 గంటలకు ఓజుబందలో ప్రారంభమవుతుందని చెప్పారు. అరకు పార్లమెంట్ నియోజకవర్గం కార్యదర్శి దిండి బాబి, వైస్ ఎంపీపీ కె.మంగాదేవి, కో ఆప్షన్ సభ్యుడు కె.ఎస్.ప్రబాకర్, పార్టీ మండల కన్వీనర్ ఎ.అప్పలరాజు, అడ్డతీగల పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి తోట రాజేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, మండల ఇన్‌చార్జ్ సీహెచ్. రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూలి పనులకు వెళ్లి తప్పిపోయిన వృద్ధుడి మృతి



వెంకటస్వామి(ఫైల్)

కొయ్యూరు: కూలి పనుల కోసం వేరే ప్రాంతానికి వెళ్లిన ఓ వృద్ధుడు అక్కడ మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అంతాడ పంచాయతీ మునసల గ్రామానికి చెందిన పాటుకూరి వెంకటస్వామి(60) నంద్యాల జిల్లా నందికొట్కూరులో కూలి పనులు చేసేందుకు స్థానికులు, మేస్త్రులతో కలిసి వెళ్లాడు. డిసెంబర్ 2న అక్కడ తప్పిపోయాడు. ఆయన కోసం మేస్త్రులు, స్థానికులు గాలించినా ఫలితం లేకపోయింది. స్వగ్రామానికి కూడా రాకపోవడంతో ఈనెల 17న వెంకటస్వామి కుమారుడు వెంకి, స్థానికులు నానాజీ, దేవుడు కలిసి నందికొట్కూరులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల తొమ్మిదిన నందికొట్కూరు బస్టాండ్‌లో అనాథ మృతదేహం లభించిందని, రెండురోజుల వరకు చూశామని, ఎవరూ రాకపోవడంతో ఖననం చేశామని అక్కడ పోలీసులు తెలిపారు. వివరాలను తెలిపి, ఫొటోలను చూపడంతో చనిపోయింది వెంకటస్వామిగా నిర్ధారించారు. దీంతోకొడుకు,బంధువులు రోదించారు.

నమ్మిన వారికి వెన్నుపోటు



ఖాళీ కుర్చీలకు చంద్రబాబు వందనం





ఆగ్రహ జ్వాల : టీడీపీ జెండాలను కాళ్లతో తొక్కుతున్న కార్యకర్తలు

- అరకు నేతలకు బాబు ఝలక్
- కిడారి శ్రావణ్,సివేరి అబ్రహంకు మొండిచెయ్యి
- అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా దొన్నుదొర
- రా కదలిరా సభలో ప్రకటించిన చంద్రబాబు

సాక్షి,పాడేరు: నమ్ముకున్న వారిని దగా చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. అవసరం ఉన్నంత వరకు వాడుకుని, తరువాత కరివేపాకులా తీసి పారేయడం ఆయన నైజమని కొందరు టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్త చేశారు. ఈ విషయం తాజాగా అరకులోయ అభ్యర్థి ఎంపికలో మరోసారి రుజువైందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా సివేరి దొన్నుదొర పోటీ చేస్తారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు శనివారం అరకులో జరిగిన రా..కదలిరా సభలో ప్రకటించి, అరకులోయ టిక్కెట్ తమకు ఇస్తారని ఆశలు పెట్టుకుని ఇన్నాళ్లూ పార్టీ కోసం పనిచేసిన వారికి ఝలక్ ఇచ్చారు. టీడీపీ కీలక నేతలు మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సివేరి అబ్రహంలు ఈ సీటును ఆశించారు. 2019 ఎన్నికల్లో అరకు నుంచి కిడారి శ్రావణ్ పోటీచేసి ఓటమి పాలయ్యారు. ఆ సమయంలోనే సివేరి అబ్రహంకు 2024 ఎన్నికల్లో అరకు సీటు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అయితే 2019 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన సివేరి దొన్నుదొర టీడీపీలో చేరారు. ఇటీవల టీడీపీ ఇన్‌చార్జిగా దొన్నుదొరకు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి సివేరి అబ్రహం చంద్రబాబు వైఖరిపై అసంతృప్తితో ఉన్నారు. తనకు ఈ ఎన్నికల్లో న్యాయం చేయాలని టీడీపీ పెద్దల ద్వారా చంద్రబాబుకు అబ్రహం విన్నవించుకున్నారు. అయితే అరకు అసెంబ్లీ అభ్యర్థిగా సివేరి దొన్నుదొరను ప్రకటించడంతో అబ్రహంతో పాటు శ్రావణ్ నిరాశ చెందారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే శ్రావణ్,అబ్రహంలకు తగిన న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చి వెళ్లిపోయారు. వారి తండ్రులు దివంగత అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలు 2018లో మావోయిస్టుల చేతిలో హత్యకు గురయ్యారు. ఈ రెండు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటానని అప్పట్లో సీఎం హోదాలో చంద్రబాబు హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో వీరిద్దరికి చంద్రబాబు తగిన న్యాయం చేస్తారని వారి అనుచరులు భావించారు. అయితే వారికి చంద్రబాబు వెన్నుపోటు పొడిచారు.

టీడీపీ జెండాలను కాళ్లతో తొక్కిన కార్యకర్తలు

సాక్షి పాడేరు: అరకు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా దొన్నుదొరను ఆపార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించడంతో పలువురు టీడీపీ నాయకులు భగ్గుమన్నారు. సభ ముగిసిన వెంటనే సభా ప్రాంగణంలోనే కార్యకర్తలు టీడీపీ అధినేత చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ జెండాలను చింపివేసి, కాళ్లతో తొక్కడం చర్చనీయాంశమైంది. గతంలోనూ ఇదే వర్గానికి చెందిన దయానిధి అనే టీడీపీ నాయకుడు సివేరి అబ్రహంకు అన్యాయం చేశారంటూ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. చంద్రబాబును చెప్పుతో కొడతానని హెచ్చరించడం సంచలనం సృష్టించింది. చంద్రబాబు వైఖరిపై కార్యకర్తల్లో రోజురోజుకు ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి.

చంద్రబాబును గిరిజనులు నమ్మరు

- ప్రజలకు చేసింది ఏమీలేకే ప్రభుత్వంపై నిందారోపణలు
- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: టీడీపీ ప్రభుత్వ హయాంలో మన్యం అభివృద్ధిని, గిరిజనుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన చంద్రబాబు నాయుడిని గిరిజనులు ఎప్పటికీ నమ్మరని, ప్రజలకు చేసింది ఏమీ లేకే చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వంపై నిందారోపణలు చేస్తున్నారని అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ అన్నారు. శనివారం ఆయన ఫోన్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరకు పర్యటనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి పూర్తిగా తెలుసుకుని మాట్లాడాలన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవస్థలను వైఎస్ జగన్ ప్రభుత్వం గాడిలో పెట్టిందని చెప్పారు. ఇప్పటి వరకు గిరిజన ప్రాంతంలో 200 సెల్ టవర్లు నిర్మించినట్టు చెప్పారు. 98 గ్రామ సచివాలయాలు, 96 రైతు భరోసా కేంద్రాల భవనాలు నిర్మించి గిరిజనులకు మెరుగైన పాలన, సంక్షేమ పథకాలు అందజేస్తున్న విషయం ప్రతిపక్షనాయకుడికి తెలియదా అన్ని ప్రశ్నించారు. అరకు నియోజక వర్గం పరిధిలో ఇప్పటి వరకు రూ.600 కోట్లతో 317 రోడ్లు నిర్మించినట్టు తెలిపారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చి, కార్పొరేట్‌స్థాయిలో అభివృద్ధి చేశామని, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజల ఆరోగ్యసంరక్షణే ధ్యేయంగా పలు కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. చంద్రబాబు హయాంలో ఏ ఒక్క గ్రామం కూడా అభివృద్ధి చెందలేదని, పెదలబుడు పంచాయతీని దత్తత తీసుకుని కోట్లు కాజేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు స్థాయి దిగజారి ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పార్టీ కార్యకర్తలకే పప్పుబెల్లంలా పంచి పెట్టారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశామని చెప్పారు. మంత్రి వర్గంలో కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గిరిజనులకు ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. గిరిజన ఎమ్మెల్యేలపైన, రాష్ట్ర ప్రభుత్వంపైన ఆరోపణలు చేసినంత మాత్రాన చంద్రబాబును ప్రజలు నమ్మరన్నారు. చంద్రబాబు చేసిన ఆరోపణలు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. నిరూపించలేకపోతే రాజకీయాల నుంచి చంద్రబాబు తప్పుకుంటారా అని ఎమ్మెలే చెట్టి పాల్గుణ సవాల్ విసిరారు.

సీఎం సభను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు



జి.మాడుగులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, చిత్రంలో విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల/పాడేరు రూరల్: విశాఖపట్నం జిల్లా భీమిలిలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బహిరంగ సభకు భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు పిలుపునిచ్చారు. జి.మాడుగుల, పాడేరులోని తలారిసింగ్‌లలో నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించేందుకు, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేందుకు అందరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం ఉమ్మడి జిల్లాలకు సంబంధించి భీమిలిలో మూడు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నామినేటెడ్ పదవుల్లో నాయకులు కలసి నియోజకవర్గం నుంచి వేలాదితో తరలిరావాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక టీడీపీ అధినేత చంద్రబాబు అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పుడు రోడ్లు బాగుచేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని చంద్రబాబుకు గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. జి.మాడుగులలో జరిగిన సభకు పార్టీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు అధ్యక్షత వహించారు. జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, సత్యనారాయణ, గంగరాజు, మత్స్యం నాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ ఎల్.కల్యాణం, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రామకృష్ణ, నాయకులు దేముళ్లనాయుడు, కొండబాబు, చంద్రపతి, పండన్న, సూర్యప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.పాడేరులో జరిగిన సభలో ఎంపీపీ సొనారి రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, పార్టీ అనుబంధ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, పార్టీ జోనల్ ఇంచార్జి కిముడు విశ్వ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ప్రసాదరెడ్డికి అపూర్వ స్వాగతం



ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శనివారం పండగ వాతావరణం నెలకొంది. ఏయూ ఉపకులపతిగా ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి రెండోసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పరిపాలన భవనం వద్ద సందడి కనిపించింది. స్థానిక విద్యార్థులతో పాటు వివిధ దేశాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి.. అపూర్వ రీతిలో స్వాగతం పలికారు. తమ అభ్యున్నతికి విశేష కృషి చేసిన ఆచార్య ప్రసాదరెడ్డిని వీసీగా రెండో పర్యాయం నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. థ్యాంక్యూ సీఎం.. వుయ్ లవ్ వీసీ సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. బంగ్లాదేశ్, ఇండోనేషియా, సూడాన్, మాలి, ఇరాన్, టాగో తదితర దేశాలకు చెందిన విద్యార్థులు తమ దేశ సంప్రదాయ వస్త్రధారణలో విచ్చేసి వీసీని స్వాగతించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రతీ విద్యార్థిని ఆప్యాయంగా పలకరించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వర్సిటీ వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి విగ్రహానికి రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్‌లతో కలిసి పుష్పాలను అర్పించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్, జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్‌రామ్, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీసీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయన ఆశీర్వచనం అందించారు. విద్యార్థులు, ఉద్యోగులు, వర్సిటీ అనుబంధ కళాశాలల అధ్యాపకులతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, ప్రముఖ ఆడిటర్ జీవీ, మాజీ ఎమ్మెల్యే చింతల పూడి వెంకటరామయ్య, పిన్నింటి వరలక్ష్మి, కొల్లు సింహాచలం, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం రీజినల్ కో-ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, డి.రామకృష్ణారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మోదకొండమ్మకు స్వర్ణ కిరీటం



కిరీటం అలంకరణ అనంతరం మోదకొండమ్మకు పూజలు చేస్తున్న అభిషేక్, భాగ్యలక్ష్మి, నరసింగరావు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి విగ్రహానికి బంగారం కిరీటాన్ని శనివారం అలంకరించారు. దాతలు ఇచ్చిన బంగారంతో ఆలయ కమిటీ ఈ కిరీటాన్ని తయారుచేయించింది. ఐటీడీఏ పీవో అభిషేక్,ఆయన తల్లిదండ్రులతో పాటు ఆలయ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు దంపతులు బంగారం కిరీటంతో పాటు వెండి సింహాలను ఆలయ పూజారికి అప్పగించారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారి విగ్రహానికి కిరీటాన్ని అలంకరించారు. ఐటీడీఏ పీవో,పాడేరు ఎమ్మెల్యే దంపతులు పూజలు జరిపిన అనంతరం అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయకమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు,ఇతర ప్రతినిధులు రత్నం, రామారావు, రాజుబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు తీర్థమహోత్సవం

మోదకొండమ్మతల్లి తీర్థమహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఆలయ ప్రాంగణంలో ఉదయం 10గంటల నుంచి ముగ్గుల పోటీలు జరుగుతాయి. సాయంత్రం కాపు సామాజిక సంఘం ఆధ్వర్యంలో మోదకొండమ్మతల్లికి సారె ఊరేగింపు నిర్వహించనున్నారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సమరోత్సాహంతో భారీజం

- కోరాపల్లిలో ఘనంగా పండగ
- జాంకరమ్మ తల్లికి భక్తి శ్రద్ధలతో పూజలు
- కత్తిసాముతో ఊరేగింపు



భారీజం ఊరేగింపులో జనసందోహం



చావడి రోడ్డులో కత్తి సాముతో నృత్యాలు చేస్తున్న గిరిజనులు



కోరాపల్లిలో జాంకరమ్మతల్లి సన్నిధిలో పూజలు చేసి వస్తున్న గిరిజనులు

జి.మాడుగుల: శత్రువులపై సాధించిన విజయానికి గుర్తుగా నిర్వహించే భారీజం ఉత్సవాన్ని మండలంలోని కోరాపల్లిలో శనివారం ఘనంగా జరిపారు. గ్రామంలో పురుషులు కత్తులతో సమరోత్సహంతో ఉత్సవంలో పాల్గొన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకమారు ఈ పండగను నిర్వహించడం ఆనవాయితీ. గ్రామంలో ఉన్న పురుషులు తల స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి పూర్వీకులు ఉపయోగించిన ఖడ్గాలతో గ్రామ సమీపంలో గల జాంకరమ్మ తల్లి ఆలయానికి వెళ్లి, అమ్మవారిని సన్నిధికిలో కత్తులను ఉంచారు. గిరిజన పూజారి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు జాంకరమ్మకు పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. డప్పు వాయిద్యాల నడుమ కత్తులతో సాము చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. పూర్వం జరిగిన యుద్ధంలో భారీ విజయం సాధించామని, దానికి గుర్తుగా చావడి రోడ్డులో కత్తి సాము జరిపి, విజయం సాధించనట్టుగా భావించి ఉత్సవాలు జరుపుకొంటున్నామని గిరిజన పెద్దలు చెప్పారు. థింసా, కోలాటం, పలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఇతర జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు.

జోరుగా.. హుషారుగా..

గోవాడ సుగర్స్ క్రషింగ్

- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో చెరకు రైతులకు రూ.9.3 కోట్ల బకాయిల చెల్లింపు
- ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసేందుకు ఆసక్తి చూపుతున్న రైతులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ జోరుగా సాగుతోంది. ఈ ఏడాది ఫ్యాక్టరీ ఏరియాలో కొంత మేర చెరకు విస్తీర్ణం తగ్గడంతో చెరకు సరఫరాపై మొదట్లో కొంత ఆందోళన ఏర్పడింది. అయితే క్రషింగ్ ప్రారంభించిన 20 రోజుల్లోనే 45 వేల టన్నులు క్రషింగ్ చేయడంతో క్రషింగ్ లక్ష్యంపై ఆశలు చిగురించాయి. చెరకు సాగు తగ్గడంతో ఈ ఏడాది 2 లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యంగా పెట్టుకొని డిసెంబరు నెలాఖరున ఫ్యాక్టరీ రెగ్యులర్ క్రషింగ్ చేపట్టింది. ఇప్పటి వరకూ 20 పనిదినాల్లోనే 45 వేల టన్నులు క్రషింగ్ చేయగా సీజన్ సమయం ఇంకా మరో రెండు నెలలు పైబడి ఉండటంతో లక్ష్యాన్ని చేరుకుంటామనే ధీమా ఫ్యాక్టరీ వర్గాల్లో ఏర్పడింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో రైతుల్లో చెరకు సరఫరా చేసేందుకు మరికొంత ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిణామం ఈ ఏడాది క్రషింగ్‌కు ఎంతో మేలు జరిగే అంశం. ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల రీత్యా చెరకు సరఫరా చేసినా పేమెంట్స్ ఇవ్వరేమోనన్న ఆందోళన మొదట్లో కొంత మేర రైతుల్లో ఏర్పడింది. అయితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు రైతులను ఆదుకునే చర్యలు తీసుకోవడం కాస్త రైతులకు ఊరట కలిగించింది. తాజాగా ఈ ఫ్యాక్టరీ చెరకు రైతుల పాత బకాయిల చెల్లింపులు కూడా జరిగాయి. ఫ్యాక్టరీ ఆర్థిక ఇబ్బందుల వల్ల గత 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి రైతులకు సుమారు రూ.9 కోట్ల 30 లక్షల చెరకు బకాయిలు నిలిచిపోయాయి. దీనితో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో గ్రాంట్‌గా వచ్చిన డబ్బులు చెరకు బకాయిలకు పూర్తిగా రైతుల ఖాతాల్లోకి ఫ్యాక్టరీ యాజమాన్యం జమ చేసింది. ప్రభుత్వం అందించిన సహకారంతో పాత బకాయిలు అందడంతో రైతుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గోవాడ చెరకు రైతులకు కేన్ పేమెంట్స్ కోసం ఇప్పటికే రూ.32 కోట్లు గత సీజన్లలో గ్రాంట్‌గా ఇవ్వగా తాజాగా మరో రూ.12 కోట్ల 30 లక్షలు గ్రాంట్‌గా ఇచ్చి రైతులకు, కార్మికులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవడంపై చెరకు రైతులు, కార్మికులు సర్వత్రా కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.

చెరకు రైతుల్లో ఉత్సాహం

ప్రభుత్వం అందించిన సాయంతో ఈ ఏడాది క్రషింగ్ సీజన్‌కు చెరకు సరఫరా చేసేందుకు రైతుల్లో ఉత్సాహంతో చెరకు సరఫరా చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇప్పటికే కాటాల వారీగా పక్వానికి వచ్చిన చెరకుకు కటింగ్ పర్మిట్లు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతుంది. మరో పక్క తాము చెరకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నామని రైతులు ముందుకొచ్చి కటింగ్ పర్మిట్ల కోసం ఫ్యాక్టరీ సిబ్బందిని కోరుతున్నారు. ఈ పరిణామం ఫ్యాక్టరీ క్రషింగ్‌కు కలిసొచ్చే అంశం. రోజుకు 2 వేల టన్నులకు మించే క్రషింగ్ చేయాల్సి ఉండగా అందుకు తగ్గట్టుగా చెరకు కూడా సరఫరా అవుతుంది. ఈ ఏడాది లక్ష్యం మేర క్రషింగ్ చేస్తేనే ఫ్యాక్టరీ రానున్న రోజుల్లో మనుగడ ఉంటుందని, లేనిపక్షంలో మిగతా ఫ్యాక్టరీల పరిస్థితే వచ్చే అవకాశం ఉందని అంతా ఆందోళన చెందుతున్నారు.


ఫ్యాక్టరీ ఆవరణంలో రైతులు తరలించిన చెరకు

ఇటువంటి పరిస్థితుల్లో రైతులు చెరకు సరఫరా చేసేందుకు మరింత ముందుకు రావడం శుభపరిణామం. ఇదిలావుండగా చెరకు సరఫరా చేయడంలో కొంత జాప్యం చేస్తున్న రైతులకు కాకుండా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కోరుతున్న రైతులకు కటింగ్ పర్మిట్లు వెంటవెంటనే ఇస్తే ఫ్యాక్టరీకి కావలసినంత చెరకు సరఫరా అవుతుందని రైతులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో యాజమాన్యం పరిశీలన చేస్తే ఈ ఏడాది క్రషింగ్‌కు కావలసిన చెరకు పూర్తిగా సరఫరా కాగలదని రైతులు అంటున్నారు. ఆ దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

మనసు మార్చుకున్నా..



నేను 2 ఎకరాల్లో చెరకు తోట వేశాను. మొదట ఈ ఏడాది ఫ్యాక్టరీకి చెరకు వేయాలా వద్దా అనే ఆలోచనలో పడ్డాను. ఇంతలో పాత బకాయిలు చెల్లించడానికి ఫ్యాక్టరీకి రూ.9 కోట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సాయం చేశారు. వెంటనే మా రైతుల ఖాతాల్లోకి బకాయిలు జమ చేశారు. దీంతో గోవాడ ఫ్యాక్టరీకి నా చెరకు పూర్తిగా సరఫరా చేయడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

– పాము అప్పలనాయుడు, చెరకు రైతు, వెంకన్నపాలెం

లక్ష్యం చేరుకుంటాం..



ప్రభుత్వం అందించిన సాయం వల్ల రైతుల పాత చెరకు బకాయిలు చెల్లించాం. ఈ ఏడాది అనుకున్న మేరకు క్రషింగ్ లక్ష్యం చేరుకుంటామనే ధీమా ఉంది. పాత బకాయిలు చెల్లించడంతో రైతులు కూడా చెరకు సరఫరా చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. పక్వానికి వచ్చిన తోటలకు, రైతులు అడిగిన వెంటనే కటింగ్ పర్మిట్లు ఇచ్చేలా చర్యలు తీసుకున్నాం. క్రషింగ్ ఆశాజనంగా కొనసాగుతోంది.

–వి.వి.సన్యాసినాయుడు, ఎండీ, గోవాడ సుగర్స్

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రోలుగుంట: చెరకు రైతుల బకాయిల చెల్లింపు కోసం ప్రభుత్వం రూ.9.3 కోట్లు మంజూరు చేయడంపై ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ యువజన శాఖ మండలాధ్యక్షుడు దోసపత్ని రాజు, చెరకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం చెరకు కాటా వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చిత్రపటాలకు వారు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గోవాడ చెరకు రైతుల సమస్య తెలుసుకున్న విప్ ధర్మశ్రీ సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారన్నారు. ఈ సమస్య తీరడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి. రమణ, రైతు నాయకులు చిటికెల వెంకటసత్తి బాబు, తమటపు సత్యంనాయుడు, ఉలబాల రాము పాల్గొన్నారు.


సీఎం జగన్, విప్ ధర్మశ్రీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడితే ప్రోత్సాహకం


కరపత్రాన్ని విడుదల చేస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఆర్టీవో అధికారులు

తుమ్మపాల: రహదారి ప్రమాదాల్లో క్షతగాత్రులను గోల్డెన్ అవర్ సమయంలో ఆస్పత్రి, ట్రామాకేర్ సెంటర్‌కు తరలించి ప్రాణాలను కాపాడిన వారికి రూ.5 వేల ప్రోత్సాహకంతోపాటు ప్రశంసా పత్రం ఇస్తామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. స్థానిక కలెక్టర్ చాంబర్లో 'సురక్షితమైన రహదారి మీ జీవితానికి రక్ష' ప్రాణదాతల రక్షణ కోసం మార్గదర్శకాలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీవో అధికారులతో కలిసి ఆయన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లే ప్రతి ఒక్కరూ హెల్మెట్ పెట్టుకోవాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పక పాటించాలని సూచించారు. రోడ్డు ప్రయాణ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అతివేగం ప్రాణానికి ముప్పు అని, సురక్షితంగా ప్రయాణం చేయాలన్నారు. ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల హెచ్చరిక బోర్డులను గమనించి డ్రైవింగ్ చేయాలన్నారు. అత్యధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ప్రమాదం వాటిల్లితే స్థానికులు తగిన సహాయ సహకారాలు అందించాలన్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది ఉండబోదన్నారు. జాతీయ స్థాయిలో ప్రాణరక్షణకు సహాయం చేసిన వారికి లక్ష రూపాయల అవార్డు అందిస్తామన్నారు. డీఆర్వో బి.దయానిధి, జిల్లా రవాణా అధికారి ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం అచ్చుల రూపంలో గంజాయి

- వాహన తనిఖీల్లో పట్టుబడ్డ వైనం
- పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు
- 54 కిలోల గంజాయి, రూ.1.89 లక్షల నగదు స్వాధీనం
- గంజాయి విలువ రూ.8 లక్షలుగా అంచనా

రోలుగుంట : గంజాయి వ్యాపారులు ఎప్పటికప్పుడు గంజాయి తరలింపులో కొత్త తరహా మార్గాలు చేపడుతున్నారు. తాజాగా వివిధ సైజుల్లో బెల్లం అచ్చుల మాదిరిగా గంజాయిని ఉంచి వాటిని వాహనాల్లో గుట్టుగా తరలించాలని ప్రయత్నించి శనివారం పోలీసులకు పట్టుబడ్డారు. కొత్తకోట సీఐ ఎల్ అప్పలనాయుడు ఆదేశాలతో ఎస్ఐ ఎల్.సురేష్ రాజన్నపేట సరిహద్దుల్లో మందస్తు సమాచారంతో వాహనాలు తనిఖీలు నిర్వహించినపుడు టాటా ఏస్ ట్రావెల్స్ వ్యాన్‌లో ఒక సీక్రెటు అరలో రెండు కిలోల బరువు గల 27 అచ్చులను గుర్తించారు. దీంతో సంబంధం ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని 54 కిలోల గంజాయి (27 గంజాయి అచ్చులను), నిందితుల వద్ద నుంచి రూ.1.89 లక్షలు నగదును స్వాధీనం చేసుకొన్నారు. గంజాయి రవాణాకు వినియోగించిన వ్యాన్‌తో పాటు ఒక స్కూటీని సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివి. చింతపల్లి మండలం కిట్టుగొండ గ్రామానికి చెందిన కొర్రా సుబ్బారావు ఈ ప్రాంతంలో పశువులను కొనుగోలు చేసి నిజామాబాద్ తరలించి విక్రయాలు చేసేవాడు. ఈ క్రమంలో నిజామాబాదుకు చెందిన మహమ్మద్ నయాముద్దీన్‌తో స్నేహం కుదిరి గంజాయి వ్యాపారంలోకి దిగాడు. జి.మాడుగుల మండలానికి చెందిన వంతల సింహాద్రితో కలిసి గంజాయిని సిద్ధం చేశాడు.

దానిని తరలించడానికి నయాముద్దీన్ (52), పశుల సుకమార్(31), ట్రావెల్ వ్యానుతో ఈ నెల 18న నిజామాబాద్‌లో బయలుదేరి 19 తేదీకి ఇక్కడకు చేరుకున్నారు. కొర్రా సుబ్బారావు(26), వంతల సింహాద్రి(31)ని కలుసుకొని గంజాయిని వ్యాన్‌లో సీక్రెట్ అరలో దాచి బయలుదేరారు. మార్గమధ్యంలో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు కొత్తకోట సీఐ విలేకరులకు వివరించారు.


గంజాయి, సీజ్ చేసిన వాహనాలతో సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ ఎల్.సురేష్

స్విచ్‌యార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న జెన్‌కో చీఫ్ ఇంజినీర్ శ్రీధర్

సీలేరు: స్థానిక జలవిద్యుత్ కేంద్రం స్విచ్‌యార్డులో శనివారం నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను జెన్‌కో చీఫ్ ఇంజినీర్ శ్రీధర్ ప్రారంభించారు. 40ఏళ్ల క్రితం జలవిద్యుత్ కేంద్రం, సీలేరు గ్రామానికి విద్యుత్ సరఫరా చేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో నూతనంగా రూ.35 లక్షలు వెచ్చించి, 3.5 మెగావాట్స్ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మను ఏర్పాటు చేశారు. ఎస్ఈ ప్రశాంత్‌కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ, ప్రభాకరరావు, డీఈఈ బాలకృష్ణ, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభలో గిరిజనులకు అగచాట్లు

దుంబ్రిగుడ: అరకు సంతబయలులో శనివారం జరిగిన చంద్రబాబు సభలో గిరిజనులకు అగచాట్లు తప్పలేదు. సభ ప్రాంగణంలో కనీసం టెంట్లు ఏర్పాటుచేయకపోవడంతో నిలువనీడ లేక ఇబ్బందులు పడ్డారు. గత్యంతరం లేక ఫ్లెక్సీలను తలపై పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. చంద్రబాబు ప్రసంగిస్తుండగా విసిగిపోయిన గిరిజనులు సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు. సభకు తీసుకొచ్చిన టీడీపీ నాయకులు కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయలేదని గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేసి చంద్రబాబు ప్రసగిస్తుండగానే విసుగెత్తి ప్రాంగణం నుంచి వెళ్లిపోయారు.


సభలో నీడలేక ఫ్లెక్సీలను తలమీద పెట్టుకున్న గిరిజన మహిళలు

బిందు సేద్యం పెంపునకు కృషి

నాతవరం : ఈ ఏడాది లక్ష్యానికి మించి తుంపర్ల బిందుసేద్యం సాగు పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు అనకాపల్లి జిల్లా సూక్ష్మ సాగునీటివనరుల ప్రాజెక్టు డైరెక్టర్ ఈవీ.లక్ష్మి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 1200 హెక్టార్లలో బిందుసేద్యం సాగు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుందన్నారు. ఇప్పటి వరకు 1500 హెక్టార్లలో బిందు, తుంపర్ల సాగుకు రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వాటిలో 712 హెక్టార్లకు కలెక్టర్ నుంచి ఆమోదించినట్లు చెప్పారు. మిగతా దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం దశల వారీగా పరిపాలన ఆమోదం అందజేస్తామన్నారు.